నిరుద్యోగులకు చేయూత

పుస్తకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హుస్నాబాద్‌టౌన్, జూలై 7: పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ గాజుల శ్యామ్‌ప్రసాద్‌లాల్ అందించి చేయూతగా నిలిచారు. హుస్నాబాద్ గ్రంథాలయంలో పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవని పలువురు నిరుద్యోగులు పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి ఇటీవల తీసుకువెళ్లగా పుస్తకాల వివరాలు తెలుపాలని ఆయన వారికి సూచించారు. నిరుద్యోగులు సూచించిన విధంగా వారికి ఉపయోగపడే పలురకాల పుస్తకాలను గ్రంథాలయ ఇన్‌చార్జిలు బాలయ్య, లావణ్యలకు పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సహకారంతో 1983-84టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కొండూరి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, వి. వెంకట్రామిరెడ్డి, కన్నోజు శ్రీనివాస్, జగన్, రాజబ్రహ్మచారి, కరణ్ తదితరులు అందజేశారు. పుస్తకాలు అందించిన అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు గ్రామంలోని పలువురు నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తజన సంద్రం

కొమురవెల్లి 'మల్లన్న' క్షేత్రంలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

గంగరేగు చెట్టు వద్ద భక్తులు

చేర్యాల, జూలై 7 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలోని స్వామి వారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు, అర్చకులు భక్తులకు సేవలందించారు.

ఆర్ఎస్టాంగ్‌కు ఘన నివాళి

హుస్నాబాద్‌లో ఆర్ఎస్టాంగ్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్, జూలై 7: తమిళనాడు రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్టాంగ్ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం రాత్రి ఆర్ఎస్టాంగ్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డేగల వెంకటేశ్వర్లు, సుధాకర్, ఎనగందుల శంకర్, వేల్పుల రాజు, శరత్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట ఆఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవ్‌గౌడ్

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 7 : కొండపాక మండలం దుద్దెడలో ఆదివారం మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవ్‌గౌడ్, సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ సభ్యులు నర్సింహులు, వేణు, రవి ఆధ్వర్యంలో దుద్దెడ రన్నర్స్‌తో కలిసి 10 కేఎం రన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విజేతలకు మాజీ సర్పంచ్ మారథాన్ మెడల్స్ బహూకరించారు. అనంతరం సిద్దిపేటలో జరిగే మారథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, కోణం చంద్రం, పిల్లి యాదగిరి, రాజనర్సింహులు, ఆరేపల్లి రమేశ్, బింగి వేణు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో కులవివక్ష సిగ్గుచేటు

గజ్వేల్, జూలై 7: ఆశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బందిపై హత్యానేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ అండగా ఉండాల్సిన పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష దారుణమన్నారు. ప్రజాపాలన, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలోని పోలీస్‌శాఖలో కుల వివక్షత కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కేసును పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దళిత, సామాజిక, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వర్షాల కోసం అభిషేకం

సీతారాములకు లిఖిత నామాలతో అభిషేకం చేస్తున్న రామరాజు

గజ్వేల్, జూలై 7: వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుతూ శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో రామరాజు ఆదివారం అద్దాల మందిరం వద్ద శ్రీరాముడికి లిఖిత అమృతనామాలతో సీతారాములకు అభిషేకం చేశారు. వర్షాలు కురిస్తే రైతులు ఆనందంగా పంటలు పండించుకొని జీవనం కొనసాగిస్తారన్నారు.

హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా సదానందం

ఒగ్గోజు సదానందం

హుస్నాబాద్, జూలై 7 : హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జెస్ కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పట్టణానికి చెందిన న్యాయవాది ఒగ్గోజు సదానందం నియామకమయ్యారు. ఇన్‌చార్జి ఏజీపీగా సదానందాన్ని నియమిస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సదానందం నియామకంపై బార్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర న్యాయవాదులు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నియామకానికి సహకరించిన బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శంకుస్థాపనలు సరే.. పనులు ప్రారంభమెప్పుడో

- నాటిప్రభుత్వం మంజూరు.. నేటి ప్రభుత్వం శంకుస్థాపన
- మూడు మాసాలు గడిచినా పరిశీలించని టెండర్లు.. పూర్తిచేయని అగ్రిమెంట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మూడు మాసాల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వేసిన శిలాఫలకం

హుస్నాబాద్ టౌన్, జూలై 7: సమస్యలకు నిలయంగా ఉన్న హుస్నాబాద్ పట్టణానికి కేసీఆర్ ప్రభుత్వం నిధుల వరద పారించింది. ఇందులో భాగంగానే గత ఏడాది మేలో కేసీఆర్ ప్రభుత్వంలోని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ హుస్నాబాద్ పర్యటన సందర్భంగా టీయూఎఫ్ఐడీసీ కింద నిధులు మంజూరుచేయగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులకు శంకుస్థాపనలు చేసిన నెలలు గడుస్తున్నా పనులను ప్రారంభించలేదు.

శంకుస్థాపన చేసి మూడుమాసాలు..

హుస్నాబాద్ పట్టణంలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. ఇందులో భాగంగా పట్టణంలో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, పార్కు, మున్సిపల్ నూతన భవనం ప్రహరీ, కమ్యూనిటీహాల్స్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా పనులను ప్రతిపాదిస్తూ ఈ ఏడాది మార్చి 13న బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు.

పనులు ప్రారంభంఎప్పుడో ..

సమస్యలకు నిలయంగా ఉన్న పలు కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా టెండర్ల నిర్వహణలో ఆలస్యమతున్నది. నిత్యం సమస్యలతో సతమతమవుతున్న ప్రజల ఇబ్బందులను త్వరగా పరిష్కరించాల్సి ఉండగా పనుల ప్రారంభంపై పట్టింపులేదనే భావన వ్యక్తం అవుతున్నది. ఒకవైపు వర్షాకాలం నడుస్తున్న ఈక్రమంలో టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లతో ఒప్పందంచేసుకుని పనులు ప్రారంభించాల్సి ఉండగా మూడు మాసాలు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభమే కాలేదు. అభివృద్ధి పనులను చేపట్టే విషయంలో నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా కొన్ని పనులకు తాజాగా మూడు రోజులక్రితమే టెండర్లు పూర్తిచేసినట్లు సమాచారం. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కల్పించుకుని పట్టణంలో అభివృద్ధి పనులను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

టెండర్లు పరిశీలిస్తున్నారు

హుస్నాబాద్ పట్టణంలో రూ. 21.35కోట్ల పనులకు టెండర్లు పిలవడం జరిగింది. ఈ టెండర్లను సైతం ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే కాంట్రాక్టర్లకు అప్పగించి పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

-సాయిప్రణీత్, ఏఈమున్సిపల్, హుస్నాబాద్‌టౌన్

మోరీకట్టించి ఇబ్బంది పోయేటట్టు చెయ్యండి

మాకు మోరీలేదు. రోడ్డులేదు. వానకాలం బాగా ఇబ్బంది ఉన్నది. ఈ మోరీనీళ్లన్నీ రోడ్డుమీదనే ఉండి దోమలు, ఈగలతో ఇబ్బంది అయితుంది. నీళ్లు కరెంట్ స్తంభం కిందికి పోయినయి. తెల్వక నేను అటుదిక్కుపోతే నాకు షాక్‌కొట్టింది. జర ఎట్లన్న చేసి మోరీకట్టించి ఇబ్బంది పోయేటట్టు సెయిండ్రి.

-తహేరబేగం, నేతాజీనగర్, హుస్నాబాద్‌టౌన్

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకుడు ఏవీఎన్ రాజు

గజ్వేల్/ములుగు, జూలై 7: గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకుడు ఏవీఎన్ రాజు అన్నారు. ఆదివారం గజ్వేల్, ములుగు మండల కేంద్రాల్లో గ్రంథాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా రికార్డులను పరిశీలించి అక్కడ ఉన్న పుస్తకాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రంథాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. భవిష్యత్‌లో గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు కొన్యాల తిరుపతి రెడ్డి, సబిత పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

బైరాన్‌పల్లిలో విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 7: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయోడిజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఏర్పాటు కోసం ఆదివారం గ్రామస్తులు భూమి పూజ చేశారు.మాజీ సర్పంచ్‌లు బండి శ్రీనివాస్, ఎడవెల్లి చంద్రారెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల యాదయ్య, నాయకులు గందె మల్లేశం, కొలిపాక ఉపేందర్, నాగభూషణం, భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

వెంకట్రావుపేటలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

తొగుట, జూలై 7: మండలంలోని వెంకట్రావుపేటలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలను ఊరేగించారు. గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొమురవెల్లి, జూలై 7 : గురువన్నపేట-సిద్దిపేట బస్సుసర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆదివారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామస్తులు వినతి ప్రతం అందజేశారు. మల్లన్న భక్తులతో పాటు ఆయా గ్రామాల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి బస్సును యథావిధిగా నడపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, నాయకులు మల్లం బాలయ్య, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, కర్రోళ్ల రాజు, అక్కెం మల్లయ్య, ఈగ కనకరాజు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి, జూలై 7 : కుటుంబ కలహాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మిరుదొడ్డి టౌన్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్‌కు చెందిన ధర్మారం కనుకయ్య (50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. కనుకయ్యకు ఇద్దరు సంతానం కాగా గత ఏడాది కూతురు వివాహం జరిగింది. అనతి కాలంలోనే కూతురుకు విడాకులు కావడంతో తీవ్రమైన మనోవేదనకు గురయ్యాడు. ఇంట్లో నిత్యం కుటుంబ కలహాలు జరగడంతో మనస్తాపానికి గురైన కనుకయ్య శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎస్సీ హాస్టల్ పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గ్రామస్తులు కనుకయ్యను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసున నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మిరుదొడ్డి, జూలై 7 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కంది చంద్రయ్య (70) వ్యవసాయంతో పాటు చేపలు పట్టుకొని విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం గ్రామపెద్దచెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలకు వేసిన వల చంద్రయ్య కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. అతడి చిన్నకోడలు యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

9న గజ్వేల్‌లో కృతజ్ఞత సభ

గజ్వేల్, జూలై 7: నరేంద్రమోదీపై నమ్మకంతోనే ప్రజలు మూడోసారి దీవించారని, రాబోయే రోజుల్లో దేశాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సురేశ్‌గౌడ్, జశ్వంత్‌రెడ్డి, రాంరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే అన్ని ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావుకు గెలుపొందిన సందర్భంగా ఈ నెల 9న గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్‌లో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీవర్గీకరణ అమలుకాక మాదిగలు, ఉపకులాలు తీరని నష్టానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, జూలై 7

చేర్యాల : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజేందర్

మద్దూరు(ధూళిమిట్ట): ధూళిమిట్టలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల: పెద్దరాజుపేటలో వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్: అంబేద్కర్ చౌరస్తాలో జెండావిష్కరణ చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 7 : కొండపాక మండలంలోని బందారం ప్రభుత్వ పాఠశాల నుంచి ఊర చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య డిమాండ్ చేశారు. దుద్దెడ నుంచి వయా బందారం మీదుగా నంగునూరు మండల కేంద్రానికి, తిమ్మాయిపల్లి నుంచి హన్మకొండకు వెళ్లే రోడ్డును బందారంలో చేపట్టిన అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొమురయ్య, మల్లేశం, యాదయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు యశస్వినిరాజు ఎంపిక

యశస్వినిరాజు

సిద్దిపేట, జూలై 7: జాతీయస్థాయి 50వ జూనియర్ అక్వేటిక్ వాటర్ పోలో పోటీలకు సిద్దిపేట పట్టణానికి చెందిన పచ్చిమడ్ల యశస్వినిరాజు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్ల మల్లికార్జున్, ప్రవీణ్, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పల్ సాయిరామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేశ్ యశస్వినిరాజును అభినందించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 7 : కొండపాక మండలం దుద్దెడ పాఠశాలలో చదివి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన దుద్దెడ గ్రామానికి చెందిన పబ్బోజు రక్షితకు ఆదివారం దుద్దెడ ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన రక్షిత పేదరికాన్ని జయించి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం విద్యార్థులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిద్దె రమేశ్, ప్రధానకార్యదర్శి బాకీ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి మిద్దె శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న స్నేహితులు

మర్కూక్, జూలై7: మండలంలోని యూసఫ్‌ఖాన్‌పల్లికి చెందిన మెకానిక్ జంగిటి నవీన్ (25) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తోటి మెకానిక్‌లు మానవత్వంతో అతడి కూతురు అక్షర పేరు మీద రూ.51450 ఎల్ఐసీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆదివారం ఎల్ఐసీ బాండ్‌పేపర్‌ను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కార్యవర్గాన్ని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాల్గుణ

సిద్దిపేట, జూలై 7 : ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని గోల్డెన్ బంకిట్ హాల్‌లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల పర్యవేక్షకుడిగా తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాల్గుణ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా అక్బర్ నవాజ్, ఉపాధ్యక్షులుగా సుగుణాకర్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, నగేశ్, జాయింట్ సెక్రటరీగా నర్సింహులు, కోశాధికారిగా మాజీన్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీనారాయణరెడ్డి, చక్రపాణిగౌడ్, సాజిద్‌పాషా, గోవర్ధన్ రెడ్డి, అజార్‌పాషాను ఎన్నుకున్నారు.

మానసిక దివ్యాంగులకు చేయూత

సిద్దిపేట టౌన్,జూలై 7 : అభయజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు సిద్దిపేట వనిత క్లబ్ చేయూతగా నిలిచింది. బాల్‌లక్ష్మి, చంద్రశేఖర్ దంపతుల సహకారంతో ఆదివారం మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులను క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు జోజి, క్లబ్ సభ్యుడు వీరేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు